అక్షర - శిల్పాలు

5959
3-6B

5959
శ్రీకాకుళం

3-6B

# ముల్లును ముల్లుతోనే..

"నా పేరు కళాపతి మీ కోసం మద్రాసు నుంచి వచ్చాను" కళాపతి కుర్చీలో కూర్చుని అన్నాడు.

"నమస్తే. మీరు వ్రాసినవుత్తరంఅందింది." అన్నాడు చిన్నారావు కొద్దిగా సంతోషంగా.

"మీరేనా చిన్నారావు?" అడిగాడు కళాపతి.

"అవును."

కళాపతి తీరికగా జేబులోంచి రుమాలాతీసి, చెమట పట్టినముఖాన్ని, చేతులనీ తుడుచుకుంటూ అన్నాడు.

"మీఇల్లు కనుక్కోవడం కష్టం అయింది.

"కొద్దిగా లోపలగా వుంది కాబట్టి కష్టమే."

"టేక్సీవాడు ఎటెటో త్రిప్పితీసుకు వచ్చాడు. విసుగు వొచ్చేసింది."

కళాపతి తను కూర్చున్న గదివంక చూసాడు కొద్దిగా

ఆసక్తిగా. మధ్యతరగతికి చెందిన మనిషి ఇల్లులా వుంది అది పూర్తిగా. మధ్యగది అది.

ఓమ్మూల చుట్టచుట్టి వున్నచాప. చాప ప్రక్కన చిన్న పిల్లలు ఎక్కే వూగేగుర్రం. రెండుగాడ్రేజ్ ఫోల్డింగుకుర్చీలు. గోడకి ఆనించి వుంచిన, కోడు విరిగిపోయిన చెక్కకుర్చీ. ఓ చెక్క టేబులుమీద టేబిల్‌లాంప్, పుస్తకాలు, డిక్షనరీ తెల్లకాగితాలు.

చిన్నారావు టేబుల్ ఫేన్ ప్లగ్‌సాకెట్‌లో వుంచి గాలి కళాపతికి వచ్చేలా అమర్చాడు ఫేన్‌ని.

"వంతీసుకుంటారు? కాఫీ, టీ, పాలు. వంకావాలంటే అవున్నాయి."

"థాంక్స్. ఇప్పుడవేంవద్దు."

"ఇప్పటికి ఎన్నిసినిమాలు మీరు డైరక్టు చేసారు?" అడిగాడు చిన్నారావు కొంచెంసేపాగి.

"పదిదాకా. ప్రస్తుతం మూడు చిత్రాలు డైరక్టు చేస్తున్నాను. అర్జెంటుగా ఓకథ కావాల్సి వచ్చింది."

చిన్నారావు ఫేను గాలి స్పీడు తగ్గించాడు. మరీ వేగంగావస్తూంటే.

"వమయినా వ్రాస్తున్నారా క్రొత్తవి ?" అడిగాడు కళాపతి.

చిన్నారావు టేబుల్‌మీదవున్న కాగితాల దొంతర వంక ఓసారి చూసి చెప్పాడు.

"కొత్తగా ఓ నవల మొదలు పెట్టాను. ఈసారి కొత్త థీమ్. కొత్త పంథా అంతా.

"ఏంథీమ్?"

"బ్లాక్ మార్కెటీర్స్ మీద."

కళాపతి ముఖం కాంతివంత మయింది. చిన్నారావు గమనించాడా సంగతి.

"అలాంటి కథ కోసమే చూస్తున్నాను. ప్రేమకథలు, ఫార్ములా కథలు చాలా తీసాను. మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చింది. మంచికథ దొరుకు తుందనే ఆశతోనే.

చిన్నారావు సర్దుకు కూర్చున్నాడు కుర్చీలో.

"ప్రేమకథలు అవీ కావాలంటే మరో ప్రసిద్ధ రచయితకి ఫోన్ చేసి తెప్పించుకునే వాణ్ణి. పత్రికల్లో అనేకకథలు వస్తున్నాయి సినిమాని దృష్టిలో వుంచుకొని వ్రాసినవి."

"అవును"

"మీ కథలు మొదట నుంచీ చదువు తున్నాను. చాలా బాగా వ్రాస్తారు మీరు. రియలిస్టిక్‌గా, కనస్ట్రక్టివ్‌గా వుంటాయి మీ కథలు."

"థాంక్సండి"

చిన్నారావు మనసులోనే సంతోష పడ్డాడు ఓ సినిమా డైరెక్టరు తన కథలని పొగుడుతూండటంవల్ల.

"మీ కథ సినిమా తీయాలనే సంకల్పంతో వచ్చానండి చిన్నారావు గారు."

చిన్నారావు చిన్నకొడుకువచ్చి, మూలనున్న చెక్క గుర్రం ఎక్కి వూగసాగాడు. చిన్నారావు కోప్పడి పంపించే సాడు కొడుకుని లోపలికి.

"ఏమైనా కథలున్నాయా మీ దగ్గర రెడీగా?" అడిగాడు కళాపతి చిన్నారావుని.

నేను ప్రస్తుతం వ్రాస్తున్న కథ మీద మీకు ఇంట్రస్ట్ వుందా?" అడిగాడు చిన్నారావు

తలవూపాడు కళాపతి.

"చెప్పండి క్లుప్తంగా.

చిన్నారావు పావుగంటసేపు కథచెప్పాడు, పాత్రల పేర్లు, సంఘటనలు టూకీగావివరిస్తూ. జాగ్రత్తగావిన్నాడు చిన్నారావు చెప్పేకథని డైరెక్టర్ కళాపతి.

"ఎక్సెలెంట్ గా వుంది" అన్నాడు పూర్తిగా విని.

"ఇప్పుడే వస్తానుండండి" అని చిన్నారావు లోపలికి వెళ్ళాడు మధ్యగదిలోంచి. మధ్యగదికీ, వంటగదికీ మధ్య వున్న తలుపు ప్రక్కన నుంచుని వాళ్ళ సంభాషణ వింటోంది చిన్నారావు భార్య

"సినిమావాళ్ళా ?" అడిగింది భర్తని చిన్నారావు భార్య, ఆశ్చర్యం సంతోషం కలబోసి.

"అవును. మొన్నమనం వెళ్ళాం 'ప్రజలే నాయకులు' అన్న సినిమా. అది ఈయన డైరెక్టు చేసిందే".

"అలాగా బావుందా సినిమా !" అన్నది చిన్నారావుభార్య విప్పారిన నేత్రాలతో.

"పాలున్నాయా ?"

"వున్నాయి, కాఫీ కలపమంటారా ?"

"కలుపు. బాగా చేయాలి"

"నాకు తెలుసులెండి. అయితే మీ కథ సినిమా తీస్తారా ?" అడిగింది రహస్యంగా.

"అవునుట"

"ఎవర్నయినా కనుక్కుని మరీ చెప్పండి రేటు. చాలా ఇస్తారంటారు సినిమావాళ్ళు"

"అయిదు వేలడుగుతాను"

భార్య కాఫీ కలపడానికి స్టవ్ వెలిగించగానే మళ్ళీ మధ్యగదిలోకి వచ్చాడు రచయిత చిన్నారావు.

"సిగరెట్ త్రాగచ్చా ఇక్కడ ?" అడిగాడు కళాపతి.

"త్రాగండి"

జేబులోంచి గోల్డు ఫ్లేక్ సిగరెట్ పాకెట్ తీసి, అందులోవున్న ఒకే ఒక సిగరెట్ వెలిగించి, ఆ ఖాళీపెట్టెని ఏష్ట్రెలా వుపయోగించాడు కళాపతి.

క్రొత్త సిగరెట్ పాకెట్ తీసి ఆఫర్ చేశాడు కళాపతి, చిన్నారావుకి.

"ఇంట్లో త్రాగను పిల్లలముందు" చెప్పాడు చిన్నారావు.

"మంచిపద్ధతి. నేనుకూడా అంతే. బయటవద్దనుకున్నా ఎవరో వకరు ఆఫర్ చేస్తుంటారు నాకు."

"హైద్రాబాద్‌కి ఏమయినా షూటింగ్ పనిమీద వచ్చారా? అడిగాడు చిన్నారావు

"మిమ్మల్ని కలవాలనే. క్రొత్త పిక్చర్ వుగాదికి మొదలుపెట్టి, వినాయకచవితికి రిలీజ్ చేయాలని తొందరలో వున్నాడు నిర్మాత. మీ టర్మ్సు చెప్పండి"

చిన్నారావు గుండె సంతోషంతో వేగం హెచ్చింది. తన కథ నచ్చింది! కొనబోతున్నాడు !!

"నాకుపూర్తిగా క్రొత్త. టర్మ్సుఅంటూ ఏమీలేవు కథకిమాత్రం సంభాషణలు వ్రాయాలనివుంది."

"మీచేతే వ్రాయిస్తాను ఎలాగయినా. వెయ్యిన్నూటపదహార్లు ఇస్తాము మీకథకి.

చిన్నారావు మౌనంగా వుండిపోయాడు.

"మీరు కథని అయిదారుపేజీలలో ఇందాక నాకు చెప్పింది క్లుప్తంగా వ్రాసివ్వండి. నిర్మాతకి చూపించాలి. ఆయనకీ కథవిషయంలో అభిరుచిఎక్కువ. ఆయనకి వినిపించి ఓ. కె. చేయిస్తాను."

"వెయ్యిన్నూటపదహార్లు చాలా తక్కువనుకుంటాను. అయిదువేలు తక్కువలేకుండా ఇస్తారని విన్నాను సినిమా కథలకి" నెమ్మదిగా చెప్పాడు చిన్నారావు.

చిన్నగా నవ్వాడు కళాపతి.

"నిజమే. మూడువేలు ఇచ్చాను ఇప్పుడు నేను సగం పూర్తిచేసిన చిత్రానికి. వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది

అవయినా. ఆ రచయిత కథలు రెండు మూడు సినిమాలుగా వచ్చాయి కాబట్టి అంతమాత్రం ఇచ్చారు."

చిన్నారావు ఇంకా అసంతృప్తిగా కనబడటం చూసి అన్నాడు కళాపతి.

"ఇది సినిమాపరిశ్రమకి ప్రవేశంగా తీసుకోండి. మొదటి సారి కాబట్టి డబ్బు గురించి ఆట్టే పట్టుపట్టకండి. సంభాషణలకి మరో అయిదువందలు యిప్పిస్తాను. నిర్మాతతో మాట్లాడి అంతా కలిపి రెండువేలు తక్కువ కాకుండా చూస్తాను. ఈ సినిమా బాగాపోతే మీరు డిమాండ్ నిబట్టి అమ్ముతారు మీ రెండో కథ.

చిన్నారావుకి సబబుగా అనిపించింది కళాపతి చెప్పే మాటలు. తనని వెదుక్కుంటూ వచ్చాడు అందులో. మొదటిసారి డబ్బువిషయంలో గట్టిగా వుండకూడదు.

"అలాగే. ఒప్పుకుంటాను" చెప్పాడు.

"గుడ్. సాయంత్రం కథ సినాప్సిస్ వ్రాసివుంచుతారా? రాత్రికి వెళ్ళిపోతున్నాను తిరిగి."

"అలాగే."

"నేను వెళ్ళగానే పరిస్థితులు చూసుకుని టెలిగ్రాం ఇవ్వడమో, వుత్తరం వ్రాయడమో చేస్తాను. మీరు మద్రాస్ రావాల్సివుంటుంది, స్క్రీన్‌ప్లే వ్రాసేటప్పుడు. ఎగ్రిమెంట్ మీద సంతకం చేసి చెక్ తీసుకుందురుగాని అప్పుడు."

"అలాగే. షుమారుగా ఎప్పుడు రావాల్సివుంటుంది నేను ?" అడిగాడు చిన్నారావు.

"మరో పది, పదిహేనురోజుల్లో."

"వస్తాను"

"షూటింగ్ మొదలయ్యేలోపల మీ పేరు కథా వివరాలు ప్రెస్‌లో రిలీజ్ చేస్తాము. సినిమాకి వ్రాస్తున్నా రంటే, పత్రికలకి మీరుపంపేకథలు చెల్లుబడిఅయిపోతాయి తిరిగి రాకుండా"

"నిజమే." అన్నాడు చిన్నారావు కృతజ్ఞతగా. అంత దాకా అసంగతి తట్టలేదు చిన్నారావుకి

"ఒక్కక్షణం వుండండి. కాఫీ తీసుకుందురుగాని" చిన్నారావు లోపలికివెళ్ళి భార్యఅందించిన స్టెయిన్‌లెస్ స్టీల్ గ్లాసులతో బయటకివచ్చాడు.

"అబ్బే ఎందుకండి శ్రమ" అన్నాడు కళాపతి.

"శ్రమకాదు. సంతోషం" అందించాడు ఓగ్లాసు.

"మీరు ఎక్కడ పనిచేస్తున్నారు ?"

"రైల్వేలో."

"మీ రైల్వేలోపనిచేసే అతనే మాన్యూవేవ్ చిత్రంలో హీరో. కుర్రాడు బాగాచేస్తున్నాడు. చిత్రం బాగా పోతుం దని నమ్మకంవుంది మాకందరికీ."

"నాకు తెలుసతను."

"హి విల్ కమప్. మీరుచెప్పిన కథకి ఓ మంచి పేరుకూడా ఆలోచించివుంచండి. సెంటిమెంటల్‌గా వుంటే ప్రేక్షకులు ఎగబడతారు.

"అలాగే"

"కుటుంబం, మనసులు, హృదయాలు వచ్చేలా చూడండి. నా ఎడ్రస్ వ్రాసుకోండి చెప్తాను. విజిటింగ్ కార్డ్స్ హోటల్ గదిలో వున్నాయి. సాయంత్రం జ్ఞాపకం చేయండి వచ్చినపుడు."

చిన్నారావు కళాపతి చిరునామా వ్రాసుకున్నాడు.

"నాన్నా నేనూ సినిమాల్లోకెళ్తాను" ఆరేళ్ళ చిన్నారావు కొడుకు వచ్చి తండ్రి భుజంచుట్టూ చేతులువేసి అన్నాడు.

"అలాగేబాబు. మరో ఇరవై సంవత్సరాలు ఆగాక తప్పకుండా సినిమాల్లోకి వెళ్దువుగాని" అన్నాడు కళాపతి నవ్వి.

రెండునిముషాలు తర్వాత లేచాడు కళాపతి. టాక్సీ దాకా సాగనంపాడు చిన్నారావు అతన్ని.

"చిన్నవాడే. మీఅంత వయసుంటుంది" అన్నది చిన్నారావు భార్య మధ్యగదిలోకివచ్చి.

" ఈయనతీసిన చాలాసినిమాలు డబ్బుచేసుకున్నాయి.

వెతుక్కుంటూవచ్చిన పెద్దమనిషితో బేరాలాడితే ఏం బావుంటుంది?''

''ఏంచేద్దామేమిటి ఆడబ్బుతో?''

''ముందర ఆ అప్పుతీర్చి, మిగిలినదానితో నీకో చంద్రహారం చేయిస్తాను.''

చిన్నారావు భార్య ముఖం సంతోషంతో వెలిగింది పూర్ణ చంద్రుడిలా.

''కాఫీకలిపి తీసుకువస్తానుండండి'' అన్నది వంట గదిలోకి వెళుతూ.

నిముషాల్లో ప్లేట్‌లో చేగోడీలతో, గ్లాసులో పొగలు క్రక్కే వేడివేడి కాఫీతో వచ్చింది.

చేగోడీలుతింటూ, కాఫీ చప్పరిస్తూ కథవ్రాయటం మొదలు పెట్టిన చిన్నారావుకి వినబడుతోంది, దొడ్లో గోడ దగ్గరనుంచి ప్రక్కింటావిడతో కబుర్లుచెప్తున్న భార్యగొంతు.

''ఇప్పుడు మాఇంటికి కారులోవచ్చినాయన ఎవరనుకున్నారు? సినిమా దర్శకుడు. మా ఆయనచేత సినిమాకి కథ వ్రాయిస్తున్నాడు. మా ఆయన వ్రాసిన కథ సినిమాగా వస్తుంది త్వరలో.''

''ఈవూళ్ళో షూటింగ్ అయితే మమ్మల్నికూడా తీసుకువెళ్తారా?''

''తప్పకుండా. సినిమా విడుదలయిన మొదటిరోజునే మనందరం కలిసి...''

“నవ్వుకున్నాడు రచయిత చిన్నారావు. భార్య ఎక్సయిట్‌మెంట్‌కి.

## 2

దాదాపు అయిదునెలలతర్వాత చిన్నారావు నమ్మలేకపోయాడు అసలు అలా జరగచ్చనీ, అలాజరుగుతుందనీ ఎప్పుడూ వూహించలేదు కలలోకూడా.

“నిజమండీ. కావాలంటే మీరువెళ్ళి చూసిరండి” అన్నది చిన్నారావు భార్య.

ఆరోజు మొదటిఆటకి వెళ్ళాడు చిన్నారావు నిజం తెలుసుకోడానికి. ఎడ్వర్‌టైజ్‌మెంట్ స్లైడ్స్, ఇండియన్ న్యూస్‌రివ్యూ అయ్యాక సినిమా మొదలయింది.

పదిహేడు రీళ్లు.

కళాపతి దర్శకత్వంవహించిన సినిమా అది. పూర్తి రంగుల్లోతీయబడ్డ చిత్రం.

పావుగంట సినిమాగడిచాక కథ కొద్దికొద్దిగా వేగం పుంజుకోసాగింది. కళ్ళప్పగించి చూస్తూండిపోయాడు చిన్నారావు.

కథ సాగుతున్నకొద్దీ తెరమీదపాత్రలు కదులుతున్న

కొద్దీ, చిన్నారావుగుండెల్లో దడ, వంట్లో నీరసం ప్రారంభం అయ్యాయి. ఇంటర్వెల్ దాకా అలా ముళ్ళమీద కూర్చున్నట్లుగా కూర్చున్నాడు చిన్నారావు.

ఇంటర్వెల్‌లో లేచి కేంటీన్‌వైపువెళ్ళాడు. స్ట్రాంగ్ టీ త్రాగి ఘాటయిన చార్మినార్ అంటించాడు. తనకు తట్టుకోలేని పరిస్థితివస్తేతప్ప చిన్నారావు ఎప్పుడూ అంత ఘాటయిన సిగరెట్ త్రాగడు.

ఇంటర్వెల్ తర్వాత సినిమా మళ్ళా మొదలయింది. సినిమా పూర్తిగా చూసాకు చిన్నారావు 'జై హింద్'దాకా.

కథ పూర్తయింది. చక్కటిపంథాలో బ్లాక్ మార్కెటీర్సమీద నడిచిన కథ అది.

కొద్దిగా తడబడే అడుగులతో బయటకి నడిచాడు చిన్నారావు థియేటర్‌లోంచి. హృదయంనిండా అలుముకున్న విచారంతో, మనసునిండా ఆలోచనలతో నడిచాడు చిన్నారావు ఇంటికి.

పదినిముషాలలో చేరుకున్నాడు చిన్నారావు ఇంటికి. గాడ్రేజ్ ఫోల్డింగ్ కుర్చీలో కూలబడ్డాడు.

“ఏమండి ? చూసారా సినిమా ! మనకథకదా అది!” అడిగింది చిన్నారావు భార్య.

“అవునే. మనల్ని మోసంచేశాడు” అన్నాడు చిన్నారావు బాధగా.

“నిలువునా మోసంచేశాడు. ఇంటికివచ్చి కథడిగి, మీచేత కథని వ్రాయించుకుని, తన హోటల్‌రూమ్‌కి తెప్పించుకుని మరీ మోసంచేశాడు.”

చిన్నారావు మనసు మొద్దుబారిపోయింది. ఈ అనుకోని దొంగతనానికి. తన కథను ఆవిధంగాడబ్బుఇవ్వకుండా దొంగిలించి సినిమాతీస్తారని అనుకోలేదు చిన్నారావు.

“కథ స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కళాపతి అని వేసుకున్నాడు తెరమీద. వీడిమొహంమండ. మనమేదొరికామా మోసంచేయడానికి.”

చిన్నారావు భార్య కంఠం రుద్ధమయింది.

చిన్నారావు ఎదురుగా టేబిల్ మీదవున్న కాగితాల వంక చూశాడు. తను కష్టపడి వ్రాసిన నవల అది. ఆ సినిమా కథని నవలగా వ్రాశాడు చెప్పాక. నిస్పృహగా ఆ కాగితాల్ని ప్రక్కనపెట్టి టేబిల్ మీదకి వాలిపోయాడు.

చాలాసేపు దాదాపు అరగంటదాకా అలాగే కూర్చున్నాడు. చిన్నారావు భార్య అతన్ని డిస్టర్బ్‌చేయలేదు. శాపనార్థాలు పెడుతూ, తిడుతోంది కళాపతిని.

ప్రక్కింటివాళ్ళతో చెప్పింది గోడకి ఇవతలనుంచుని ప్రక్కింటావిడ జాలిపడింది.

“ఆయనవ్రాసిన కథ సినిమాతీస్తారని మీరు పది సార్లయినా చెప్పారాకథను మాకు. సినిమాచూశాక మాకూ అనుమానంవచ్చింది. మిమ్మల్ని మోసంచేశారు.”

"సినిమావాళ్ళు ఇంత చెడ్డవాళ్ళనుకోలేదు."

"ఈ సందుచివర లాయర్ గారున్నారుగా ఆయనతో చెప్పండి. ఏమయినా కేసువేయమంటారేమో."

చిన్నారావుతో చెప్పింది భార్య ఆ రాత్రి.

"సందుచివర లాయర్ గారితో మాట్లాడితే మంచిదని ప్రక్కింటావిడ చెప్పింది."

"కోర్టులూ, కేసులూ మనచేతకాదు. కేసుపెట్టినా గెలుస్తామని నమ్మకంలేదు. పైగా బోలెడు డబ్బుకూడా కావాలి. ఇలాంటి కేసులు, కోర్టులు అలవాటే వాళ్ళకి. ఓ నమస్కారంపెట్టి వూరుకుందాం."

"రేపుసాయంత్రం లాయర్ గారమ్మాయి పుట్టినరోజు. పేరంటానికి పిల్చారు. ఆయన కనబడితే అడుగుతాను వూరికే మాటవరసకి."

"నీయిష్టం"

మర్నాడు చిన్నారావు అఫీసులో నీరసంగా వుండిపోయాడు. కళాపతి, అతని చిత్రం, తనకథగతి గుర్తుకు వచ్చినప్పుడల్లా గుండె కలుక్కుమంటోంది.

చిన్నారావు భార్య అడిగింది లాయర్ని. పేరంటానికి ఆలస్యంగావెళ్ళింది ఆయనన్ని అడగాలనే. చిన్నారావుని రమ్మని చెప్పాడాయన.

భార్య బలవంతంమీద చిన్నారావు వెళ్ళాడు లాయర్

ఇటికి ఆరాత్రి కొద్దిగా బిజీయవుతూనే. ముందుగదిలో కూర్చొని లాయర్ కుటుంబం అంతా పేకాట ఆడుకుంటున్నారు కబుర్లు చెప్పుకుంటూ.

"కమ్ మిస్టర్ చిన్నారావ్" ఆహ్వానించాడులాయర్ చిన్నారావుని.

"క్రిందటివారం మీ కథ చదివానండి. చాలా బాగుంది. మీ కథలో సిమిలీస్, ప్రకృతివర్ణనలు అద్భుతంగా వుంటాయి" లాయర్ పెద్దకూతురు పలకరించింది.

"రండి ఆగదిలో కూర్చుందాం."

లాయర్, చిన్నారావు ఆయన ఆఫీస్‌గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. ఆయన టేబిల్ మీద తెరచివున్న ఓ ఫైల్‌ని మూసి, దానిమీద మోచేయుంచి చిన్నారావువంక చూస్తూ అన్నాడు.

"మీ ఆవిడ చెప్పింది. అసలు జరిగిందేమిటో పూర్తిగా చెప్పండి మొదటనుంచి."

"ఎనిమిది నెలల క్రితం అనుకుంటాను మొదటిసారిగా కళాపతిదగ్గరనుంచి వుత్తరంవచ్చింది నాకు. నాకథలు ఆయన చదువుతున్నారని, సినిమాకి పనికివచ్చే కథలు మంచివేమైనా వుంటే వ్రాయమని.

నాదగ్గర నవలకి ఓ మంచి కథ వుంది. వుందని వ్రాశాను ఆయనకి. ఆరు నెలలక్రితం వచ్చారాయన మా ఇంటికి. అర్జెంట్‌గా సినిమాకిపనికొచ్చే కథవకటి కావాలని

ఏదైనా మంచికథ వినిపించమని కోరితే అప్పుడే మొదలు పెట్టిన ఆ నవల కథ చెప్పాను."

ఆయన వేలు చెవిలోవుంచి త్రిప్పుతూ అడిగాడు.

"తర్వాత ?

"ఆ కథ క్లుప్తంగా వ్రాసివ్వమని అడిగితే వ్రాసిచ్చాను. వెళ్ళగానే నిర్మాతతో మాట్లాడి నాకు కబురు పంపుతాననీ, మద్రాస్ రావటానికే సిద్ధంగా వుండమనీ చెప్పి వెళ్ళాడు."

"మీకు పిలుపురాలేదా ? వచ్చివుండదు" అన్నాడు లాయర్ చిరునవ్వుతో.

"రాలేదు. నాకథగురించి ఏంచేశారని రెండు మూడు వుత్తరాలు వ్రాశాను నెలరోజులు చూసి. సమాధానం కూడా రాయలేదు కళాపతి మర్యాదకోసమైనా."

"మీరుచెప్పినకథ ఇప్పుడు సినిమాగావచ్చిందా ?"

"అవును. 'అంతా ఇంతే' సినిమా వారంరోజుల క్రితం విడుదలయింది. దానికి దర్శకుడు కళాపతి".

"కథ ఎవరువ్రాసినట్లు చూపించారు ?"

"దర్శకుడే."

"కళాపతన్నమాట."

"అవును."

చిన్నారావు ఆలోచిస్తూండిపోయిన లాయర్ వంశీ కాస్సేపుపోయాక అడిగాడు దిగులుగా.

"మనం ఏమైనా చేయగలమా ఇప్పుడు ?"

"ఆ కథ నవలగా వ్రాశారా ?"

"పూర్తిచేశాను."

"ఏ పత్రికకి పంపారు ?"

"దేనికీ పంపలేదు."

"అదేం ?"

"సినిమాకోసం నాకథలో చిన్నమార్పులు చేస్తామని, కథ ఫైనలైజ్ అయేదాకా దేనికీ తొందరపడి పంపవద్దని చెప్పారు కళాపతి. ఆయనమాటమీద గౌరవంవుంచి పూర్తి చేసినా పంపలేదు ఏ పత్రికకీ."

"ఆ కథ మీదేనని ఋజువు చేయగలరా ?"

దిగులుగా నవ్వి అన్నాడు చిన్నారావు "వూహు."

"అయితే మనమేం చేయలేం."

"అదే అనుకున్నాను నేనుకూడా. పూర్తిగా దగా చేశారు నన్ను."

"కోర్టుద్వారా ఈఅన్యాయాన్ని జయించటం కష్టం

కోర్టుకి కావాల్సిందల్లా రుజువు. సాక్ష్యం. అది మనదగ్గర లేదు."

"నాకు డబ్బు ఇవ్వకపోయినా ఫర్వాలేదు. కనీసం తెరమీద ఆకథ నా దేనని క్రెడిట్ టైటిల్స్‌లో చూపించినా బావుండేది రచయితగా."

"అలా చూపిస్తే వాళ్ళు చిక్కుల్లో పడతారు మీరు కేస్ పెడితే. అందుకనే అలా చూపించలేదు."

"లక్షలు ఖర్చుచేసి సినీమాతీసారు. రెండువేల రూపాయలు ఇవ్వడానికి మొహం చూసుకున్నారు. వాళ్ళకో లెక్క కాదు ఆ కాస్త సొమ్ము"

చిరునవ్వు నవ్వాడు లాయర్.

"అక్కడ దగా, మోసం, అన్యాయం విపరీతం. ఆ సినిమా ప్రపంచంలోని వాళ్ళకే చెల్లుఅది. అలవాటు పడి పోతారు. బయటవాళ్ళకి అంతా కొత్తగా వుటుంది."

చిన్నారావు మౌనంగా వుండిపోయాడు.

"నీతి, నిజాయితీ తక్కువ చాలామందికి. పెద్దనిర్మాతలైనాసరే. చిత్రం బాగాపోయి, లాభాలు బాగానేవచ్చినా సరే. చిన్న చిన్న ఆర్టిస్ట్స్‌కి, సాంకేతిక నిపుణులకీ, పబ్లిసిటీ సంస్థలకీ ఎగగొట్టడం పరిపాటి. నాకు అలాంటివాళ్లు చాలామంది తెలుసు."

"ఎందుకలా?"

"ఆనవాయితీగా వస్తోంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఇంగ్లీష్ సినిమాలు చూసి, అలాంటివి ఓ నాలుగైదు కలిపి సినిమా తీయటం చూడటంలేదా మీరు? ఇంగ్లీషు మ్యూజిక్ని కాపీకొట్టి ట్యూన్స్ కట్టడం చూడటంలేదా మీరు! 'ప్లాగియారిజమ్' అంటారు ఇంగ్లీషులో ఇలాచేయడం."

"నాకు తెలియదు ఇదివరకు."

"మీరుచూసే ప్రతీమూడు సినిమాల్లో ఒకటి పై తరహాకి చెందినదే. ఏదో ఓ భాషలోంచి, జపాన్, ఫ్రెంచి చిత్రాలు ఆధారంగా హిందీలో ఎన్నో చిత్రాలొచ్చాయి. ఓ హెన్రీ జేమ్స్ హేడ్లీ ఛేజ్ లాంటి ఇంగ్లీష్ రచయితల కథలు సినిమాలుగా వచ్చాయి."

చిన్నారావు మాట్లాడలేదు. వింటూండిపోయాడు.

"రచయిత ఎప్పుడూ పొరపాటునైనా సినిమావాళ్లకి కథ - ప్రచురింపబడని కథ, అది తనదని వృత్తరీత్యా నిరూపించుకోలేనికథ వినిపించకూడదు. కథలోని మంచిఅంశాలు బాగుంటే కథమొత్తం ఉపయోగించుకుంటారు. రసంతీసిన చెరుగ్గడలా అయిపోతుందా కథ మళ్ళీ వ్రాయడానికి వీలు లేకుండా?"

"రచయితే ఎక్కడైనా ఎప్పుడైనా స్కేప్‌గోట్ అవుతాడు. గంటల తరబడి కష్టపడి, బుర్రబద్దలు కొట్టుకొని వ్రాస్తాడు ఎన్నో సాయంత్రాలు, రాత్రులు వంటరిగా వుండిపోయి. నిజానికి రచయితల కదోశాపం అనాదిగా.

రచయితకి ఆదరణ వుండదు. బీదవాడె రచయితెప్పుడూ మన భారతదేశంలో."

"తారలలాగా కాకుండా చాలా తక్కువ మొత్తానికే వంశోషపడిపోతాడు"

దిగాలువున్న చిన్నారావుని చూస్తే ఎలాగైనా అతనికి సాయపడాలి అనిపించింది లాయర్‌కి. కాని ఎలాగో తెలియలేదు. న్యాయస్థానానికి, న్యాయానికి హృదయం, మనిషిలా అర్థంచేసుకొనే మనసువుండవు. రిజిడ్ సెట్ ఆఫ్ రూల్స్ తప్ప.

ఆలోచించసాగాడు.

"వస్తానండి" అన్నాడు చిన్నారావు లేచి.

"ఈ సారి ఎప్పుడైనా కథకోసం యెవరయినావస్తే, ఎగ్రిమెంట్ వ్రాసేటప్పుడు నా దగ్గరకిరండి. వాళ్ళు టైప్ చేసి యిచ్చిన కాగితం మీద కళ్ళు మూసుకొని సంతకం పెడితే మరోసారి మోసపోయిన వారవుతారు."

"తప్పకుండా"

"యింకెవరికీ కథ వినిపించరుగా మళ్ళీ !"

చిన్నగా నవ్వి అన్నాడు చిన్నారావు వెళ్ళిపోతూ.

"మనిషికి అనుభవం కంటే మంచి ఉపాధ్యాయుడు దొరకడు ఎక్కడా"

# 3

ఆ సినిమా బాగా నడిచింది. 'అంతా యింతే' కళాపతి దర్శకత్వ ప్రతిభకి తార్కాణం. అతని సినిమా రచనా పాటవంలో ఓ మైలురాయి అంటూ పొగిడాయి పత్రికలు. శతదినోత్సవం చేసుకుందా చిత్రం.

కళాపతి తదుపరి చిత్రానికి మరో మంచి కథకోసం వెదుకుతున్నాడు 'అంతా యింతే' నిర్మాత త్వరగా కథ వినిపించమనీ, కొత్తచిత్రం వెంటనే ప్రారంభించాలనీ తొందర చేస్తున్నాడు.

కళాపతికి అనుకోకుండా అదృష్టం కలసివచ్చింది.

కొత్తసినిమాకథకోసం ఇద్దరు ప్రొఫెషనల్ రైటర్స్ని దగ్గర కూర్చోబెట్టుకొని కథ ఏ విధంగా వుండాలో సన్నివేశాలు చెప్పి, తను చూసిన అనేక భాషల చిత్రాలలోని సంఘటనలు చెప్పి మంచి కథ ఆ పంథాలో తయారు చేయమని చెప్పాడు.

వాళ్ళు కథ వ్రాసి యిచ్చేలోపలే అదృష్టం కలసి వచ్చింది కళాపతికి. కలలో కూడా అనుకోని విధంగా ఓ మంచి కథ వచ్చింది.

చిన్నారావు నించి వచ్చిందో మంచికథ. ఆ కథతో పాటు చిన్నారావు వ్రాసిన ఉత్తరం యిలా వుంది—

పూజ్యనీయులయిన కళాపతిగార్కి,

నేను మీకు గుర్తుండే వుంటాను. 'అంతా యింతే' సినిమాకి నేను కథకుణ్ణి. యెవరికీ తెలియక పోయినా. ఆ చిత్రం కథా బలం మీద నడిచిన ఆ సినిమా విజయంలో నాకు ప్రథమ భాగముందని నా నమ్మకం. నేను వ్రాసిన కథ సినిమాగా నిర్మింపబడి విజయవంతంగా వంద రోజులు ప్రదర్శింపబడటం నా కెంతో ఉత్సాహాన్నిచ్చింది.

ఆ విజయం యిచ్చిన ఇన్స్పిరేషన్‌తో నేను మరో కథ వ్రాసాను. దాదాపు వంద పేజీలపైనే వున్నా యీ కథలో పాత్రలకి తగ్గట్టుగా పేర్లు, సంభాషణలు, పాటలు ఎక్కడుంచాలో సజెషన్స్, సినిమా బావుండటానికి కొన్ని సూచనలు, నాలుగు పాటలు అన్నీ వున్నాయని గమనించ గలరు.

మొత్తం పరిశీలించి మీకు అంగీకారమైతే నాకు డబ్బు ఇచ్చినా ఇవ్వకపోయినా దయచేసి కథారచయితగానైనా ప్రేక్షకులకు నా పేరు పరిచయం చేస్తారని ఆశిస్తాను.

మీ నుండి వీలైనంత త్వరలో సమాధానం వస్తుందని యెదురు చూస్తూ—

భవదీయ
చిన్నారావు

కళాపతి గంటలో చిన్నారావు పంపిన మేన్ స్క్రిప్టు చదివాడు పూర్తిగా.

ఎక్సలెంట్‌గా వుంది అనుకున్నాడు. ఆఫ్ బీట్ చిత్రంగా రూపొందించవచ్చు ఆ కథని. చిన్నారావు వ్రాసిన సంభాషణలు. పాత్రల చిత్రణ, పాటలు, పాటలుంచాల్సిన సన్నివేశాలు అన్నీ నచ్చాయి కళాపతికి.

నిర్మాతకి కథవినిపించాడు ఆ రాత్రి. నాలుగురోజులు కథ డిస్కస్ చేశారు ఐదారుగురు కలసి. చివరికి స్క్రిప్ట్ తయారుచేశారు అంతా ఓ. కె. చేశారు.

అక్కడక్కడ కొద్ది మార్పులతో దాదాపుగా కథ అంతా చిన్నారావు వ్రాసినదే తీసుకున్నారు పాత్రల పేర్లతో సహా. పాత్రికేయులని పిలచి కొత్త ప్రొడక్షన్ వివరాలు కొన్ని అందించారు.

మంచిరోజు పూజచేసి మొదటిషాట్ చిత్రీకరించారు. డిస్ట్రిబ్యూటర్ బంధు వొకాయనచేత క్లాప్ కొట్టించారు ఆ జూమ్‌షాట్ సీన్‌కి.

శర వేగంతో నిర్మాణం పూర్తయ్యింది. రీ రికార్డింగ్, పేచ్‌వర్క్ మొదలయినవన్నీ పూర్తయి విడుదలకు సిద్ధమయింది 'ఎప్పుడూ ఇంతే' ఫిబ్రవరికల్లా.

తెలుగు వుగాదికి విడుదల చేశారు ఆ చిత్రాన్ని. మార్చి 26న విడుదలయింది 24 సెంటర్సలో.

మార్చి 27న ఆ చిత్రనిర్మాత తన యింట్లో స్నేహి

షలతో శ్రేయోభిలాషులతో తన చిత్రం గూర్చి ముచ్చటి స్తూండగా అందింది సమాచారం. ఆ నిర్మాత. దర్శకుడు కళాపతి గుండె లదిరేలాంటి సమాచారం అందింది.

'ఎప్పుడూ ఇంతే' ప్రదర్శన న్యాయస్థానం రద్దు చేసింది. మూడో ఆట ప్రదర్శింపబడగానే.

'స్టే ఆర్డర్' వచ్చింది కోర్టునుండి. ప్రదర్శన నిలిపి వేయబడింది అన్నిచోట్లా.

కారణం: ఆ చిత్రానికి ఉపయోగింపబడ్డ కథ దొంగి లింపబడింది.

చిన్నారావు అనే రచయిత వ్రాసిన కథ అది. అతని అనుమతి లేకుండా అతని కథ వినియోగించుకోవడం నేరం కాపీ రైట్ ఏక్ట్ క్రింద.

"చిన్నారావు కెంత ధైర్యం ?" అనుకున్నాడు కళాపతి.

"వాడిపని నేను పడతాను. నిలువ నీడ లేకుండా చేస్తాను" మండిపడ్డాడు నిర్మాత.

పంపిణీదారుడు అన్నాడు—

"ఇలా లాభం లేదు. ముందు రచయిత దగ్గరకు వెళదాం"

"అవును, యీ కథ అతని స్వంతమని ఎలా రుజువు చేయగలడో చూద్దాం" అన్నాడు కళాపతి.

"సరే" అన్నాడు నిర్మాత.

# 4

"ఎన్నిలక్షలు పోసి ఆ సినిమా తీసాం! దానిమీద ఎంత పెట్టుబడి పెట్టాం! నీకేమైనా విచక్షణాజ్ఞానం వుండక్కర్లేదా కవీ!" ఎగిరారు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్స్.

ఆరు గంటల తర్వాత చిన్నారావు ముందు వున్నారు అతని ఆఫీస్‌లో.

"ప్రొద్దున్న ఆఫీస్‌కి ట్రంక్ కాల్ చేసి చెప్పిన విషయమే మళ్ళీ చెప్పడానికి ఇంతదూరం వచ్చారు విమానంలో?" శాంతంగా నవ్వి అన్నాడు చిన్నారావు.

"కథ నీదేనని రుజువుందా నీ దగ్గర?"

"ఏమో?"

"ముందర స్టే ఆర్డర్ విత్ డ్రా చేసుకో. లేకపోతే వుద్యోగం వూడగొట్టి నిన్ను ఎలా ఏడిపించాలో అలా ఏడిపిస్తాం"

నిప్పులు తొక్కిన కోతిలా ఒకరు ఎగిరితే, కల్లుతాగిన కోతిలా మరొకరు ఎగిరారు.

"విత్ డ్రా చేయను. ఇది ఆఫీస్. గొడవ చెయ్యకండి ఇక్కడ. రాత్రి ఇంటికి రండి"

"రాత్రి వెళ్ళిపోవాలి తిరిగి. ఇక్కడే తేల్చు."

"ప్రభుత్వోద్యోగిని పనిచేసుకోనివ్వకుండా గొడవ చేయడం నేరం. మర్యాదగా వెళ్ళండి. గెటవుట్." చినా్న రావు అంటే అభిమానంగల హెడ్ ఆఫ్ ది ఆఫీస్ తన గది లోంచి బయటకొచ్చి అరిచాడు వాళ్ళమీద.

నీళ్లు నమిలారు వాళ్ళు.

"ఇంటి అడ్రస్ తెలియదు" గొణిగాడు నిర్మాత.

"కళాపతికి తెలుసు. మీ డైరెక్టర్‌కి ఎలా తెలుసుకోవాలో తెలుసు. హైద్రాబాద్‌నుంచి వెలువడే ఏ పత్రిక వాళ్ళని అడిగినా నా చిరునామా ఇస్తారు."

బయటకి నడిచారు ముగ్గురూ.

రాత్రి చినా్నరావు ఇంటికి వచ్చారు ముగ్గురూ. చినా్నరావు పందు చివర వున్న లాయర్ ఇంటికి తీసుకు వెళ్ళాడు వాళ్ళని.

"మీరేనా ఇంతపని చేసింది?" అడిగాడు నిర్మాత లాయర్‌ని.

"చినా్నరావు నాక్లయింట్. నాక్లయింటు తరఫున నేను పనిచేయుటంలో తప్పులేదు" చెప్పాడు లాయర్ నవ్వి.

"'ఎప్పుడూ ఇంతే' చిత్రకథ చినా్నరావు వ్రాసినట్లు రుజువులునా్నయా మీదగ్గర? ఇదివరకు ఎక్కడా ప్రచురింపబడలేదే?"

"అవును. ప్రచురింపబడలేదు."

"మరి ఎలా చెప్పగలరు ఆ కథ దొంగిలించామని?"

"దొంగిలించారు కాబట్టి."

“డమిట్. అది నా స్వంత కథ” అన్నాడు కమలాపతి పెగల్చుకుని, నేలవంక చూస్తూ.

“గుడ్. ఆసంగతి కోర్టులో కూడా చెప్పండి.”

“చెప్పండి. మీ దగ్గిరున్న రుజువేమిటి?” బ్రతిమాలాడు నిర్మాత లాయర్‌ని.

“కోర్టులో కలుసుకుంటాంగా మళ్ళీ. అక్కడ చెప్తాను.’

“యిక్కడ చెప్తే అయిదు వేలిస్తాం చిన్నారావుకి. ఆకథ మాకు అమ్మినట్లు ఎగ్రిమెంటు వ్రాయిస్తాం మీ చేత. మీఫీజ్ ఎంత? వెయ్యి రూపాయలు సాధారణంగా మేం యిచ్చేది ఇలాంటి ఎగ్రిమెంట్స్‌కి. బయటికి వెళ్తాం మీరు ఆలోచించుకుని పిలవండి మమ్మల్ని.”

లేచారు ముగ్గురూ.

“అక్కరలేదు. మొదటి కథ విషయంలో చిన్నారావుని మోసం చేసినప్పుడు ఎంత బాధ పడ్డాడో దానికి రెట్టింపు మానసిక వ్యథ అనుభవించాలి మీరు. మీ ధనం చాలా వినియోగించి తీశారీసినిమా. చిన్నారావు కథ తన దని నిరూపించుకుని. డేమేజెస్ క్లెయిమ్ చేయవచ్చు. లక్షకి దావా వేస్తాడు. లేనా తన అనుమతి లేకుండా నిర్మింపబడ్డ తన కథ తాలూకు చిత్రం ప్రదర్శింపబడకూడదని కోర్టుని కోరతాడు. ‘ఎప్పుడూ ఇంతే’ ప్రదర్శన ఎప్పటికీ రద్దు చేయబడుతుంది.”

ముగ్గురూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు భయం భయంగా.

"మీరు అలా చేయకూడదు" అన్నారు డిస్ట్రిబ్యూటర్ లేచి వెళ్ళిపోతూ.

"ఇలా చేయాలని చెప్పేది మీరు కాదు. ఎలా చేయాలో నిర్ణయించేది మేము. మీరిక వెళ్ళొచ్చు."

అరగంట దాకా ప్రతిమాలి, ఇక లాభంలేదని విసిగి పోయి వెళ్ళిపోయారు ముగ్గురూ.

## 5

కోర్టు ప్రారంభం అవబోయేముందు, కళాపతి దీనంగా అన్నాడు చిన్నారావుతో.

"హార్డుకేష్ పదివేలిస్తాము. టైటిల్సలో మీ పేరు చూపిస్తాము. మాకు కథ ఇచ్చినందుకు కృతజ్ఞతలు కూడా తెల్పుకుంటాము సెల్యూలాయిడ్ మీద."

చిన్నారావు లాయర్ అన్నాడు

"బేరం అనవసరం మాదగ్గర ఫుల్ప్రూఫ్ నిదర్శనం వుంది. ఇంకో అరగంటలో జడ్జి వింటూండగా చెప్తాను తెలుసుకుందురుగాని. రచయితలని మాయచేసి ఇలా కథలని దొంగిలించడం మీకు అలవాటే. ఓ పాఠం చెబితేగాని బుద్ధిరాదు."

"యువర్ ఆనర్, చిన్నారావు ఓ చిత్రానికి కథవ్రాసి

కళాపతి అనే దర్శకుడికి పంపితే, ఆ దర్శకుడు కథని చదివి దాన్ని దొంగిలించాడు. తనే కథ వ్రాసినట్లుగా ఆ చిత్రాన్ని తీశాడు. నా క్లయింట్ చిన్నారావు తన అనుమతి లేకుండా తీసిన ఆ చిత్రం 'ఎప్పుడూ ఇంతే' ప్రదర్శింప బడకూడదని కోరుతున్నారు."

కోర్టులో గంటదాకా తీవ్ర వాదోపవాదాలు జరిగాయి ఇరుపక్షాల లాయర్స్ మధ్యా.

"చిన్నారావే ఆ కథ వ్రాశాడని రుజువేమిటి?" ప్రశ్నించాడు ప్రతిపక్షం లాయర్.

చిరునవ్వు నవ్వాడు చిన్నారావు లాయర్.

"మీ పాయింటుకి వస్తున్నాను. చిన్నారావు తను కళాపతికి పంపిన కథ రిజిష్టర్ పోస్టులో పంపాడు. కళాపతి సంతకం చేసి తీసుకున్న పోస్టల్ అక్నాలెడ్జిమెంట్ కార్డు వుంది, డేట్ స్టాంప్‌తో సహా."

"అది సరయిన సాక్ష్యం కాదు మై వెర్నెడ్ ఫ్రెండ్. కళాపతి తీసుకున్న ఆ కవరులో ఆ కథే వుండాలని లేదు. మరో కథ వుండివుండచ్చు. లేదా చిత్తుకాగితాలు వుండి వుండవచ్చు"

"చిన్నారావు వ్రాసిన ఆ కథ కార్బన్ కాపీ వుంది. చిన్నారావు తన స్వదస్తూరీతో వ్రాసిపంపిన ఆ కథ కార్బన్ కాపీ చదివితే సంభాషణలు, పాటలతో సహా అంతా ఆ చిత్రం లోనివే."

"చిత్రం విడుదలయ్యాక అలాంటి కార్బన్ కాపీలు ఎన్నయినా సృష్టించవచ్చు."

"దటీజ్ వేర్ మై పాయింట్ ఈజ్ మిలార్డ్. ఆ కార్బన్ కాపీ ఆ చిత్రాన్ని ఇంకా స్క్రీన్ ప్లే వ్రాయకముందే అసలు కథ వ్రాయకముందే వ్రాయబడింది."

"ఎలా నిరూపించగలరు?" జడ్జ్ నుద్దేశించి చెప్పిన చిన్నారావు లాయర్ ని అడిగాడు చిత్రనిర్మాత లాయర్.

"ఆ కార్బన్ కాపీ, కళాపతికి వ్రాసిన ఉత్తరం కాపీ, అన్ని కలిపి క్లాత్ వైన్ ఎన్వలప్ లో వుంచి, లక్కతో పూర్తిగా అన్నివైపులా సీల్ చేసి చిన్నారావు తన చిరునామాకే ఆ కవరుని రిజిస్టర్డ్ ఇన్స్యూరెన్స్ పోస్ట్ ద్వారా పోస్ట్ చేసాడు. కవరు మీద పోస్టల్ డేట్ స్టాంప్స్ చూస్తే ఆ చిత్రానికి ఇంకా కథ వ్రాయకముందే అది ఆ విధంగా పోస్ట్ చేయబడిందని గుర్తించవచ్చు."

"ఆ కవరు తర్వాత తెరచి లోపల కార్బన్ కాపీ వుంచి లక్కతో సీల్ చేసి వుండవచ్చు. కవరు పోస్ట్ చేసిన తారీఖున ఆ కవరులో కళాపతికి పంపానని చెప్పబడుతున్న ఆ కథ తాలూకు కార్బన్ కాపీయే వుందని నిదర్శనం ఏమిటి?"

"అవును. ఆ కవరులో అప్పటినుంచే ఆ కథ కార్బన్ కాపీ వుందని రుజువు చేయాల్సిన భారం మీమీదే వుంది' చెప్పాడు జడ్జ్

చిరునవ్వు నవ్వాడు లాయర్.

"తప్పకుండా మిలార్డ్. ఆ కవరు అప్పటినుంచీ విప్పలేదు. ఆ కవరు వచ్చినరోజునే దాన్ని చిన్నారావు తన బేంక్ లాకర్ లో భద్రపరిచాడు. అప్పటినుంచి, అంటే ఆ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే తయారవక ముందునుంచీ, ఆ కవరు ఈ క్షణందాకా బ్యాంక్ లాకర్ లోనే వుంది."

గుండుసూది నేలమీదపడితే వినిపించేంత నిశ్శబ్దంగా వుంది కోర్టు. చలనచిత్రపత్రికలకి సంబంధించిన జర్నలిస్టులు గబగబా వ్రాసుకుంటున్నారు చిన్నారావు లాయర్ చెప్పేది కోర్టు క్లర్కుతో పాటుగా.

జడ్జ్ ఇంట్రెస్ట్ గా వింటున్నాడు.

"అప్పటినుంచీ ఆ కవరు చిన్నారావు బేంక్ లాకర్ లోనే వుంది. బేంక్ లాకర్ తెరవబడలేదన్న సంగతి బేంక్ రికార్డ్సు ద్వారా గ్రహించవచ్చు. బేంక్ అధికారులు ఆ సంగతి సర్టిఫై చేసిన కాగితం మీరు పరిశీలించవచ్చు"

చిన్నారావు లాయర్ బేంక్ సర్టిఫికెట్ జడ్జికి అందించాడు. జడ్జి ఆ కాగితాన్ని చదివి తలపంకించి ఏదో వ్రాసుకున్నాడు.

"బేంక్ లాకర్ తెరచి, ఆ కవరువిప్పి ఆ కార్బన్ కాపీ చదివి. వీళ్ళు నిర్మించిన 'ఎప్పుడు ఇంతే' కథతో, మాటలతో పాత్రల పేర్లతో, పాటలతో పోల్చిచూస్తే కోర్టుకి చిన్నారావు అభియోగం ఎంత సబబయినదో అర్థమవుతుంది."

మీరు చెప్పదలచుకున్న దేమైనా వున్నదా?" అడిగాడు జడ్జి సిద్ధార్థ లాయర్ ని.

"వాయిదా కావాలి" అన్నాడు లాయర్.

"బేంక్ లాకరు తెరచి ఆకవరువిప్పి, కార్బన్ కాపీని కోర్టుకు తీసుకురావల్సిందిగా అందుకుసంబంధించిన అధికారులని ఆదేశిస్తున్నాను" అన్నాడు జడ్జి లేస్తూ.

* * *

చిన్నారావు చేతివ్రాతలోవున్న కళాపతికి పంపిన ఆ చిత్రకథతాలూకు కార్బన్ కాపీ కోర్టువారు పరిశీలించారు ఆ చిత్రాన్నికూడా చూసారు ప్రత్యేకంగా ప్రదర్శింపజేసి ఆ చిత్రానికి సంబంధించిన స్క్రీన్ ప్లే తెప్పించారు కోర్టుకే.

కళాపతి కథని దొంగిలించి తనపేరు పెట్టుకున్నాడని స్పష్టమయింది.

'ఎప్పుడూ ఇంతే' సినిమాప్రదర్శనని బహిష్కరించింది కోర్టు నిర్మాత నిలువునా కూలిపోయాడు.

ఆ కార్బన్‌కాపీని ఓ సినిమాపత్రికకొని సీరియల్‌గా ప్రచురించింది. ఆ సీరియల్ చాలామంది నిర్మాతలని, దర్శకులని ఆకర్షించింది. చిన్నారావు కల్పనాసృష్టి, పటిమ అర్థమయింది.

సంవత్సరం తిరక్కుండనే చిన్నారావు వుద్యోగం మానేసి చిత్రరంగంలో కథల, మాటల. పాటల రచయితగా స్థిరపడిపోయాడు.

దర్శకుడు కళాపతి, ఆయన నిర్మాతా ఇప్పుడు శాశ్వతంగా చిత్రరంగంనుండి బహిష్కరింపబడ్డారు. ***